# నేటితో ముగియనున్న ప్రచారం




- ఉరుకులు పరుగులతో అభ్యర్థులు
- సింగరేణి ఓటర్లపై ప్రత్యేక దృష్టి
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు
- మద్యం, డబ్బు పంపిణీకి రంగం సిద్ధం

మంచిర్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. ఏప్రిల్ 18న కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల టికెట్లు ఖరారు కావడంతో అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. దాదాపు 45 రోజులుగా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తుండగా, ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల ఫీట్లు చేశారు. అగ్రనాయకులతో రోడ్‌షోలు, సమావేశాలు, సభలు ఏర్పాటు చేస్తూ ప్రచారంలో దూసుకుపోయారు.

### అభ్యర్థులు సన్నద్ధం


లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 13న జరుగనుండగా సమరానికి అభ్యర్థులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు క్షేత్ర స్థాయిలో ప్రచారం నిర్వహించగా, పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి సంబంధించి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే గట్టి పోటీ నెలకొంది. ఎన్నికల ప్రచారపర్వాన్ని ఈ నెల 11 సాయంత్రం 5 గంటల వరకు ముగించాల్సి ఉంది. దీంతో ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల నాయకులు రంగంలోకి దిగారు. కాగా, ఎన్నికల ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న చేపట్టనున్నారు.

### సింగరేణి ఓటర్లపై ప్రత్యేక దృష్టి

లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని ప్రధాన పార్టీల నాయకులు సింగరేణి కార్మికులపై దృష్టి సారించారు. అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా వివిధ గనుల వద్ద కార్మికులతో గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేసి ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా కార్మికులను తమవైపు తిప్పుకు నేందుకు ప్రలోభాలకు తెర తీస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ఓటమిపాలైన ప్పటికీ ఆ పార్టీ నాయకులు నల్లనేలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా వామపక్ష యూనియన్ అయిన ఏఐటీయూసీ, వామపక్ష పార్టీలు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతోంది. బీజేపీ కూడా కొద్ది రోజులుగా కార్మిక క్షేత్రంలోనే ప్రచారం చేస్తున్నారు. ఇలా అన్ని పార్టీలు గనులపై ప్రచారం ముమ్మరం చేయడంతో కోల్‌బెల్ట్ ఏరియా ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఈ నెల 13న వేతనంతో కూడిన సెలవు

మంచిర్యాల కలెక్టరేట్, మే 10: లోక్‌సభ ఎన్నికల్లో సందర్భంగా ఈనెల 13న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ నిర్వహణ, సామగ్రి, ఇతర పనుల కోసం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్యాసంస్థల్లో, కళాశాలలు పోలింగ్ ముందు రోజు 12న కూడా వేతనంతో కూడిన సెలవు ఉంటుందన్నారు.




## బొగ్గుబ్లాకుల వేలంతో సింగరేణి ప్రైవేటీకరణకు బీజేపీ యత్నం






కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, గడ్డం వంశీకృష్ణ, శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య, కేకే ఓసీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

శ్రీరాంపూర్, మే 10 : బొగ్గు బ్లాకుల వేలం పేరుతో బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి.సీతారామయ్య అన్నారు. శుక్రవారం ఎస్ఆర్‌పీ 1 గనిపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్మిక సంక్షేమానికి కృషి చేసే పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. వీరభద్రయ్య, బాజీసైదా, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, మల్లేష్, అఫ్రోజ్, రాజయ్య, లచ్చన్న పాల్గొన్నారు.

**మందమర్రి టౌన్:** బీఆర్ఎస్ సీనియర్ నేత రాకం సంతోష్ తన అనుచరులతో నల్లాల ఓదెలు నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. అంబేద్కర్ రాజ్యాంగం జోలికి పోకుండా ఉండాలన్నా, రిజర్వేషన్‌లు కొనసాగాలన్నా రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే సాధ్యమన్నారు. గుడ్ల రమేష్, అర్జున్‌కుమార్, రాజు, సంగి సంతోష్ ఉన్నారు.



కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థ లేకుండా కుట్రలు చేస్తుందని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. కేకే ఓసీపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి రెండున్నర దశాబ్దాల క్రితం బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు కాపాడింది కాకా వెంకటస్వామి అని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో తన తనయుడు వంశీని ఆశీర్వదించాలన్నారు.

**చెన్నూరు:** పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. సుద్దాల, గంగారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూల రాజిరెడ్డి, దుర్గం నగేష్ పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వివేక్ పేర్కొన్నారు. బొక్కలగుట్టలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి చేతి గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీ రూ.400కు పెంచుతామన్నారు. వంశీకృష్ణను ఎంపీగా గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాడని తెలిపారు. అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. మాజీ విప్ నల్లాల ఓదెలు, మాజీ ఎంపీపీ కనకయ్య, సుదర్శన్, ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.






## నిత్యావసర సరుకులు అందజేత

చింతలమానేపల్లి, మే 10: మండలంలోని డబ్బా, దరంపల్లి గ్రామానికి చెందిన గుర్లె మల్లేష్ నాలుగు రోజులక్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబానికి శుక్రవారం ఎస్సై నరేష్ 50కిలోల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. భార్య, పిల్లలు అనాథులుగా మారడంతో చిన్నారులు చదువుకునేందుకు హాస్టల్‌లో చేర్పించేందుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్ యూత్‌వెల్ఫేర్‌సొసైటీ వ్యవస్థాపకుడు శ్రీనివాస్, సందీప్, తిరుపతి, మల్లేష్, మధుకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్సై నరేష్

# తుంగెడలో పోడు రగడ

● రైతులు, ఫారెస్టు అధికారుల మధ్య వాగ్వాదం, తోపులాట ● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు

రెబ్బెన, మే 10: మండలంలోని తుంగెడ గ్రామ శివారులో శుక్రవారం అటవీ అధికారులకు, పోడు రైతులకు మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఫారెస్టు భూమిలోకి రైతులు అక్రమంగా ప్రవేశిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధరాచారితోపాటు సెక్షన్ అధికారులు కోమల్, రవీందర్, సతీష్, రవి, బాపుతోపాటు వందమంది అటవీసిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ 50మంది రైతులు భూమి చదును చేస్తున్నారు. అక్కడికి చేరుకున్న ఫారెస్టు అధికారులు అటవీభూమిలో అక్రమంగా సాగు చేయటం సరి కాదంటూ రైతులను అక్కడి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు. అయితే ఇది కొద్ది సంవత్సరాలుగా తాము సాగు చేసుకుంటున్నామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి భూపంపిణీలో పహాణీలిచ్చారని వాగ్వాదానికిదిగారు. ఈక్రమంలో వాగ్వాదం ముదిరి ఒకరినొకరు తోసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగామారింది. దీంతో ఇరువర్గాలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొనిఇరువర్గాలను సముదాయించారు. రెవెన్యూ అధికారులు, ఫారెస్టు అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి భూమికి సంబంధించిన వివాదం పరిష్కరించుకోవాల్సిందిగాతెలియజేశారు. అనంతరం అటవీఅధికారులు11 మంది రైతులపైన రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అదేవిధంగా ఇన్‌చార్జీ రేంజ్ అధికారి శ్రీధర్‌తోపాటు సెక్షన్ అధికారి, బీట్‌అధికారులపై రైతులు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టుఎస్సై చంద్రశేఖర్‌తెలిపారు. కాగా, సంఘటనస్థలానికి ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.



రైతులు, అటవీశాఖ సిబ్బంది మధ్య ఘర్షణ వాతావరణం

# ఆత్రం సుగుణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

బెజ్జూరు/పెంచికలపేట, మే 10: బెజ్జూరు మండలం ఎల్కపల్లి శివారులోని కమ్మరికుంట వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు వెళ్లి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెంచికలపేట మండలం ఎల్లూరు, ఎల్కపల్లి గ్రామాల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సుగుణక్క మద్దతుగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం గడపగడపకూ ప్రచారం నిర్వహించారు.

**ఆసిఫాబాద్‌రూరల్:** దేశంలో పేదప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ నాయకుడు బాలేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి సుగుణక్కను అత్యధికమెజార్టీతో గెలిపించాలని కోరారు.

**బెజ్జూరు/పెంచికలపేట/సిర్పూర్(టి):** ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్‌అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని సీపీఐఎంఎల్ నాయకులు, ఏఐటీయూసీ నాయకుడు ఉపేందర్ కోరారు. శుక్రవారం వారు బెజ్జూరు, పెంచికలపేట, సిర్పూర్(టి) మండలాల్లోని నలుగు పల్లి, చెడ్వాయి, లక్ష్మీపూర్, పారిగాం, టోంకిని గ్రామాల్లో ఇండియాకూటమి అభ్యర్థి సుగుణక్క తరఫున ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలోని మసీదు వద్ద శుక్రవారం కాంగ్రెస్‌నాయకులు ప్రచారం నిర్వహించారు.

**కాగజ్‌నగర్:** పార్లమెంటుఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను అధిక మెజార్టీతో గెల్పించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. శుక్రవారం స్థానికంగా వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించలేదన్నారు.

**కౌటాల:** మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఉపాధిహామి పనులు చేస్తున్న వారివద్దకు వెళ్లి ఎంపీఅభ్యర్థిగా ఆత్రం సుగుణక్కను గెలిపించాలని కోరారు. అదేవిధంగా మండలంలోని వీర్దండి గ్రామానికి చెందిన 80మంది బీఎస్పీకార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎంపీపీ విశ్వనాత్, జడ్పీటీసీలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**తిర్యాణి:** మండలంలోని చిన్నఅరటిపల్లి, కన్నెపల్లి, పెరికపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్‌నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కోఆర్డినేటర్ జువ్వాజీ అనీల్‌గౌడ్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బెజ్జూరులో ప్రచారం న్విహిస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

## ఆత్రం సుగుణను ఆదరించండి

● మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, మే 10: పౌర హక్కుల కోసం పోరాడిన కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్రం సుగుణను గెలిపిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం కేంద్రంలో అధికారంలోకి వచ్చినట్లయితే నియోజకవర్గంలో అటవీ అనుమతులు లేక ఆగిపోయిన గ్రామాలరోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. పనిచేయాలన్న తపన ఉన్న వారికి మద్దతు తెలిపితే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ టీసీ సాయి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వారించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్, శంకర్, వెంకన్న, సతీష్, బషరత్‌ఖాన్, సకారాం, రామకృష్ణ, మహేష్, నరేందర్‌గౌడ్, నాహిర్ అలీ, షబ్బీర్, అమృత తదితరులు ఉన్నారు.

**ప్రతి ఒక్కరు ఓటు వేసేలా చూడాలి..**

**సిర్పూర్(టి):** ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్క ఓటరు ఓటువేసేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఒక్కరు కూడా తప్పిపోకుండా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



బెజ్జూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూరు, మే 10: బెజ్జూరు మండలం మర్తిడి, సలుగుపల్లి, కుంటలమానేపల్లి, బారెగూడ, అందుగులగూడ, కాటెపల్లి గ్రామల్లో శుక్రవారం బీఆర్ఎస్‌నాయకులు ఎన్నికలప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రంసక్కుకు ఓటువేసి గెలిపించాలన్నారు.

## లక్ష్మీగణపతి దేవాలయ వార్షికోత్సవం

కాగజ్‌నగర్, మే 10: కాగజ్‌నగర్ మండలం రాంనగర్‌లోని లక్ష్మీగణపతి దేవాలయ ఆరవ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలోఆలయకమిటీసభ్యులు, గ్రామస్థులున్నారు.

## ఏఐకేఎంఎస్ కార్యవర్గం

నెన్నెల, మే 10: అఖిల భారత రైతుకూలీ సంఘం మండల కమిటీని గుండ్లసోమారంలో శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి, రాష్ట్ర సహాయకార్యదర్శి లాల్‌కుమార్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి టిశ్రీనివాస్ సమక్షంలో కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా దుర్గం గంగరాజు, అధ్యక్షుడిగా దాగామ రాజు, ఉపాధ్యక్షులుగా జాగటి వెంకటేష్, రత్నం శ్రీనివాస్, కార్యదర్శిగా దుగుట రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎస్‌డీ ఆఫ్రీన్, ప్రచార కార్యదర్శిగా ఫర్జానా, కోశాధికారిగా సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఎంపీగా గోడం నగేష్‌ను గెలిపించండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్

కెరమెరి, మే 10: ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీని ప్రపంచ దేశాలు విశ్వనాయకుడిగా కొలుస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా పలుగ్రామాల నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి నాయకులు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రాంనాయక్, ఉత్తంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

**దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం: - జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు**

**ఆసిఫాబాద్ రూరల్:** దేశరక్షణ బీజేపీతోనే సాధ్య మవుతుందని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్ర వారం మండలంలోని ఇప్పల్‌నవేగాం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయిదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో సరైన నాయకుడిని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. దేశానికి మోదీపరిపాలన ఎంతో అవసరమన్నారు. మూడోసారి రావడం ఖాయమని తెలిపారు.

**పెంచికలపేట:** మండలంలోని గొంట్లపేట, పోతెపల్లి, చెడ్వాయి, మురళీగూడ తదితర గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. గోడం నగేష్‌ను గెలిపించాలని కోరారు.

**బెజ్జూరు:** బెజ్జూరు గ్రామ పంచాయతీలోని ఎల్కపల్లి గ్రామాల్లో గురువారం బీజేపీనాయకులు ఎంపీఅభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మోడి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.

**కౌటాల:** మండలంలోని శివలింగూర్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని కోరారు.



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వాంకిడి, మే 10: మండల కేంద్రంలోని బస్‌స్టాప్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆసిఫాబాద్ నుంచి వాంకిడికి వస్తున్న బైక్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో బైక్‌పైనున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను వాంకిడి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని ఆసిఫాబాద్‌కు తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు తెలియరాలేదని ఎస్సై సాగర్ పేర్కొన్నారు.

## పేద మహిళకు ఆర్థిక సహాయం

ఏసీసీ, మే 10 : మంచిర్యాల పట్టణంలోని గోదావరి రోడ్డులో నివాసం ఉండే పెట్టెం లక్ష్మీకి మంచిర్యాల పోలీసులు శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. లక్ష్మీ భర్త చంద్రయ్య తాగుడుకు అలవాటుపడి అనారోగ్యంతో నెల క్రితం మృతి చెందాడు. లక్ష్మీ తన ముగ్గురు పిల్లలతో ప్రస్తుతం అక్క ఇంట్లో నివసిస్తుంది. కుటుంబ పోషణ భారంగా మారడంతో ఉచితంగా పంపిణీ చేస్తున్న అంబలితో పిల్లల ఆకలి తీర్చుతుంది. లక్ష్మీ పరిస్థితిని కొందరు పోలీసులకు తెలపడంతో పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, మంచిర్యాల పోలీసుల తరుపున లక్ష్మీకి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు.

# పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 10: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఎన్నికల అధికారులతో మాట్లాడారు. పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎన్నికల అధికారులు ప్రత్యేక చొరవతో పరిష్కరించాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో 227, బెల్లపల్లిలో 227, మంచిర్యాలలో 287 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల ద్వారా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, డీపీవో వెంకటేశ్వ ర్‌రావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

### ఓటరు చైతన్య గీతం సీడీ ఆవిష్కరణ

మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన కవి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ రచనలో రూపొందించిన ఓటేద్దాం రండి అనే ఓటరు చైతన్య గీతం సీడీని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం తీసుకు రావడానికి చైతన్య గీతం రచించిన యోగేశ్వ ర్‌ను అభినందించారు. కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పిన్న రాజేశ్వర్ పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి



సిబ్బందికి ఓఆర్ఎస్, మందులను అందజేస్తున్న డీసీపీ అశోక్‌కుమార్

హాజీపూర్, మే 10: పార్లమెంట్ ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం గుడిపేట 13వ బెటాలియన్‌లో ఎన్నికల విధులకు హాజరవుతున్న పోలీసులకు, శిక్షణార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం లోనికి మొబైల్ ఫోన్‌లు, మంట కలిగించే వస్తువులకు అనుమతి లేదని ప్రజలకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఓటరు స్లిప్పులు, ఓటరు కార్డులు మాత్రమే అనుమతించాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సిబ్బంది ఓఆర్ఎస్, మంచినీటిని ఎక్కువగా తాగాలన్నారు. సిబ్బంది తాము విధులు నిర్వహించే పోలింగ్ కేంద్రం పరిధిలోని ఉన్న తాధికారుల ఫోన్ నెంబర్లను ముందుగానే తీసుకోవాలని సూచించారు. సూచనలు, సలహాలు పాటిస్తూ ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. ఓఆర్ఎస్, మందులను అందజేశారు. కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా, ఏసీపీ రత్నాపురం ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలు

ఏసీసీ, మే 10: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం సాయంత్రం 4 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగవద్దని, రాజకీయ పార్టీల జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ప్రదర్శించవద్దని, మైకులు, లౌడ్ స్పీకర్లు, రాజకీయ పార్టీల పాటలు, ఉపన్యాసాలు ఇవ్వవద్దని సూచించారు. విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలు, సభలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు నిర్వహించవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


కన్నెపల్లి, మే 10 : నాయకునిపేట, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు వల్ల పలు గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ఏఈ బాపు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

హాజీపూర్, మే 10: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను అడిషనల్ డీఆర్డీవో దత్తరావు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ వేణులు నిర్వహించారు. పనుల్లో అవకతవకలు జరగడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రికవరీకి ఆదేశించారు. ముల్కల్ల రూ.3747, హాజీపూర్‌లో రూ.806, టీకనపల్లిలో రూ.486, నర్సింగాపూర్‌లో రూ.172, చిన్నగోపాల్‌పూర్‌లో రూ. 896, రాపెల్లిలో రూ. 4083, ర్యాలీలో రూ. 238 మొత్తం రూ. 10,428 రికవరీకి ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకొం టామన్నారు. ఎస్టీఎం వేణు, ఎస్ఆర్‌పీ మహేష్, ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.




## దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

కాసిపేట, మే 10: లంబాడితండా(డీ)లో జరిగిన దొంగతనాన్ని పోలీసులు చేధించారు. శుక్రవారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. గత నెల 28న లంబాడితండా(డీ)లో ఆరుబయట నిద్రిస్తున్న మహిళ బామండ్లపల్లి సత్తవ్వపై కారం పొడి చల్లి దాడి చేసి మంగళసూత్రం లాక్కెళ్లారు. సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. శుక్రవారం కొండాపూర్ యాప వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ధర్మారావుపేటకు చెందిన బట్టు చరణ్‌ను సోదా చేయగా తులంన్నర బంగారు పుస్తెలతాడు దొరికిందని తెలిపారు. అతన్ని విచారించగా స్నేహితుడు బొమ్మెన అశోక్‌తో కలిసి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. పుస్తెలతాడు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు అశోక్ పరారీలో ఉన్నాడన్నారు. 12 రోజుల వ్యవధిలోనే దొంగలను పట్టుకున్న పోలీసులను సీపీ శ్రీనివాస్, ఏసీపీ రవికుమార్‌లు అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ అజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు తిరుపతి, జయచంద్ర, సంపత్, అనిల్‌కుమార్, రవిగౌడ్, శ్రీనివాస్, మల్లికార్జున్‌లకు రివార్డులు అందించారు.

## ఓటరులో చైతన్యం పెంచేందుకే ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

భీమిని, మే 10: ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వేయాలని ఓటరులో చైతన్యం పెంచేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని సీఐ కుమారస్వామి అన్నారు. శుక్రవారం బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్సై విజయ్‌కుమార్, బీఎస్ఎఫ్ సీఐ రాకేష్ మిశ్రా, బీఎస్ఎఫ్ ఎస్సై విపిన్ కుమార్, ఏఎస్సై ఏకే మిశ్రా, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరం

కాసిపేట, మే 10: దేవాపూర్‌లో శుక్రవారం ఓరియంట్ సిమెంట్ కంపెనీ, మంచిర్యాలలోని ఆదిత్య ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గిరిజన గూడాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వంద మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని మంచిర్యాలకు రెఫర్ చేశారు. ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్రప్రతాప్ జోషి, హెచ్ఆర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, ఆదిత్య ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

చెన్నూరు, మే 10: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం చెన్నూరు హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కోరారు. శుక్రవారం సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి గడ్డపై గులాబీ జెండా ఎగరడమే లక్ష్యంగా కేటీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఉంటుందని, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నేడు 5కే రన్

మంచిర్యాల కలెక్టరేట్, మే 10: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి బాలుర ఉన్నత పాఠశాల వరకు ఓటరు చైతన్యంపై ఉదయం 5 గంటలకు 5కే రన్ నిర్వహిస్తున్నామని డీఆర్డీవో కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతీ, యువకులు విజయవంతం చేయాలన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక పార్టీలు

బెల్లంపల్లి, మే 10 : బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా వ్యతిరేక పార్టీలు అని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తుందన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, నిరుపేదల బ్యాంకు ఖాతాల్లో రూ. 15 లక్షలు జమ చేస్తామని హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం కాదన్నారు. బీజేపీ పెద్దలు రాజ్యాంగాన్ని మారుస్తామని పేర్కొనడం సిగ్గు చేటన్నారు. దివంగత కాకా వెంకటస్వామి పేద ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, అదే కుటుంబం నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు వినోద్, వివేక్‌లు పేదల మంచి కోసమే ముందుకు వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ గడిచిన 10 ఏండ్లలో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేసిందేమి లేదని, బీజేపీ ప్రైవేటు వ్యక్తులకు జాతీయ పరిశ్రమలను అప్పజెప్పే కుట్రలు చేస్తుందన్నారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు, అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వినోద్‌తో మహేశ్వర్‌రావు

## పీపీఐడీ పార్టీ ఎంపీ అభ్యర్థి వినూత్నప్రచారం

బెల్లంపల్లి, మే 10: అయ్యా నీ బాంచన్ కాళ్లు మొక్కుతా, డబ్బుకు మద్యానికి ఓటు వెయ్యకు, ఐదు సంవత్సరాల జీవితం తాకట్టు పెట్టకు అంటూ పెద్దపల్లి పార్లమెంట్ పీపీఐడీ పార్టీ ఎంపీ అభ్యర్థి మోతె నరేష్ వినూత్నంగా ప్రచారం చేశారు. శుక్రవారం కాంటా చౌరస్తా వద్ద డబ్బుకు, మద్యానికి ఓటు వేయవద్దని ప్లకార్డును పట్టుకుని ప్రచారం చేశారు. దుకాణాలు, కూరగాయల వ్యాపారుల వద్దకు వెళ్లి ఏకంగా వారి కాళ్లు పట్టుకుని నోట్లకు అమ్ముడుపోవద్దని కోరారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ ప్రజల్లో ఓటు విలువ తెలియజేసేందుకు ప్లకార్డుపై ఓటును అమ్ముకోవద్దని రాసి ప్రచారం చేస్తున్నానన్నారు. ఈ ఎన్నికల్లో పీపీఐడీ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న తనను గెలిపించాలని కోరారు.

## దేశ ప్రగతిని దెబ్బతీసిన మోదీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

మందమర్రి టౌన్, మే 10: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పదేండ్ల పాలనలో దేశ ప్రగతిని దెబ్బ తీసిందని రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఐఎన్టీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారం లోకి వచ్చి మనువాదం, మతోన్మాదంతో కులాలు, మతాల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని తెలిపారు. వేలాది పరిశ్రమలు మూత పడి నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. తమ ప్రభుత్వ పాలనలో సింగరేణికి ఎలాంటి ఢోకా ఉండదని తెలిపారు. ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలన్నారు. కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, సూర్యనారాయణ, శంకర్‌రావు, గుడ్ల రమేష్, సంగి సంతోష్, రాములు, బుచ్చయ్య, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి పలు సంఘాల మద్దతు

శ్రీరాంపూర్, మే 10 : పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతు తెలుపుతున్నట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు.

మందమర్రిటౌన్: పదేండ్ల బీజేపీ పాలనలో ఒరిగిందేమిలేదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు గోపాల్, సీనియర్ జర్నలిస్టు ఎండీమునీర్‌లు తెలిపారు. ప్రమాదంలో ప్రజాస్వామ్యం, సంక్షోభంలో రాజ్యాంగం అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉండాలన్నా, ప్రజల సంక్షేమం సాధ్యపడాలన్నా ఇండియా కూటమిని గెలిపించుకోవాలన్నారు.

మనువాద, మతోన్మాద బీజేపీని ఓడించి రాజ్యాంగం, రిజర్వేషన్‌లను కాపాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్ తెలిపారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

భీమారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంశీకృష్ణను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు.

జైపూర్: పద్మశాలి సంఘం నాయకులు పలువురు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మార్త మారుతి, ఆవిడపు గణేష్, అవిడపు అనిత, పలు గ్రామాల పద్మశాలిలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

శ్రీరాంపూర్: సింగరేణిని ప్రైవేటీకరణ నుంచి కాపాడుకుందామని ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఆర్కె 5 గనిపై ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తోందని, కార్మికులు సమిష్టిగా అడ్డుకోవాలని కోరారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఆర్కె 5 గనిపై ప్రచారం నిర్వహిం చారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలో పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓట్లు వేయాలని కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, రాజేశ్వర్‌రెడ్డి, శీను, మంగయ్య పాల్గొన్నారు.

తాండూర్: సీపీఎం బలపరుస్తున్న ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని సీపీఎం నాయకులు అన్నారు. కాసిపేట గ్రామంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

శ్రీరాంపూర్, మే 10 : బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి సింగరేణిని కాపాడుకుందామని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కోరారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కార్మికులకు అనేక హక్కులు సాధించిపెట్టామని, సింగరేణిని లాభాల బాట పట్టించామని తెలిపారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కోరారు. శుక్రవారం 3, 4 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్మికుడిగా, కార్మిక నాయకుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఈశ్వర్‌కు ప్రజల సమస్యలు తెలుసన్నారు.

దండేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అన్ని వర్గాల ప్రజలకు సరైన న్యాయం జరిగిందని జిల్లా నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు అన్నారు. తానిమడుగు, చింతపల్లి, చెల్కగూడ, నర్సాపూర్ గామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. జడ్పీటీసీ యశ్వంత్‌నాయక్ బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

హాజీపూర్: కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నాగారం, గడ్‌పూర్, చిన్న గోపాల్‌పూర్ ప్రచారం నిర్వహిం చారు.

**చెన్నూరు:** ఆస్నాద, దుగ్నేపల్లి, కిష్టంపేట గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

## కార్పొరేట్ కళాశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల కలెక్టరేట్, మే 10: 2024-25 విద్యా సంవత్సరానికిగాను ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌తో పాటు ఎంసెట్ కోచింగ్ పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 30 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని లేదా www.telanganaepass.cgg.gov.inలో సంప్రదించాలన్నారు.

## ఘనంగా మద్ది రాంచందర్ వర్ధంతి

కాసిపేట, మే 10: ఆదివాసీనాయకపోడ్ సేవా సంఘం వ్యవస్థాపకుడు మద్ది రాంచందర్ 24వ వర్ధంతిని శుక్రవారం దేవాపూర్‌లో నాయకపోడ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకపోడ్ జెండాను ఆవిష్కరించారు. నాయకపోడ్‌లు బాగా చదువుకోవాలని తన ఇల్లును చదువుకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కొమ్ముల బాపు, శ్రీనివాస్, మహేందర్, లక్ష్మణ్, రాజేష్, మల్లేష్, రాంచందర్ పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** ఆదివాసీ నాయకపోడ్ సంఘం వ్యవస్థాపకుడు దివంగత మద్ది రాంచందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ది భార్గవ్, రాజన్న, రాజ్‌కుమార్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

వేమనపల్లి, మే 10 : మండంలోని నీల్వాయి, మామడ, గొర్లపల్లి, కేతనపల్లి, కాటేపల్లి, వేమనపల్లి, జాజులపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సెక్టార్ అధికారులు బాపురావు, నరేష్‌లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. క్యాదర్శులు సాయికృష్ణ, సిరాజ్, అశోక్,జాఫర్‌లు పాల్గొన్నారు.

## మోడల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్‌లు ప్రారంభం

ఏసీసీ, మే 10: మోడల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభమైనట్లు మంచిర్యాల మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రజనీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని, 27న ఎంపికైన అభ్యర్థుల జాబితా రూపొందించి 29 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను www.tsmodelschool.comలో సమర్పించాలన్నారు. ఎంపికైన వారికి ఇంగ్లీష్ మీడియంలో ఉచిత పాఠ్య పుస్తకాల అందజేత, బాలికలకు హాస్టల్ వసతి కూడా ఉందన్నారు.


## కులం పేరు మార్పునకు కృషి చేసినందుకు సన్మానం

ఏసీసీ, మే 10: నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్‌ను సంఘం నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతకాని కులం పేరు పదేళ్ళుగా ఆన్‌లైన్ మీసేవ సర్టిఫికెట్‌లో నేతకానీకి బదులుగా నేత్కానీ అని వస్తుందని, ఈ విషయంపై నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ ఆధ్వర్యంలో పలువురికి వినతి పత్రాలు అందించారన్నారు. కులం పేరును సరి చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సెగ్గెం రాజేష్, గోల్ల రాయమల్లు, దుర్గం సంతోష్, యువరాజ్, గురువయ్య పాల్గొన్నారు.



# నేటితో ప్రచారానికి తెర

- స్పీడ్ పెంచిన అన్ని రాజకీయ పార్టీలు
- ఉరుకులు పరుగులతో అభ్యర్థుల ప్రచారాలు
- బూత్ స్థాయిలో ఎత్తుగడలపై నేతల కసరత్తు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు
- విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీకి రంగం సిద్ధం




ఆసిఫాబాద్, మే 10: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి నేటితో తెర పడనుంది. శనివారం సాయంత్రం 5గంటలకు ప్రచార పర్వం ముగియనుంది. దీంతో అన్నిపార్టీలు ప్రచారంలో స్పీడ్ పెంచాయి. అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల ముఖ్య నాయకులు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మరోవైపు ఇన్నాళ్లు సభలు, సమావేశాలు, ర్యాలీలతో ప్రచారాన్ని హోరెత్తించిన నేతలు ప్రస్తుతం బూత్‌స్థాయిలో దృష్టిసారించారు. ఇప్పటికే బూత్ స్థాయిలో కులాలు, వర్గాల వారీగా ఓటర్లను గుర్తించిన అభ్యర్థులు పోలింగ్ తేదీ నాటికి తమవైపు తిప్పుకునేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇన్నాళ్లు తమవెంట ప్రచార పర్వంలో వెన్నంటి తిరిగిన నేతలు, క్రియాశీలక కార్య కర్తలు బూత్‌స్థాయిలో పరిమి తం కావాలంటూ అభ్యర్థులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. బూత్ స్థాయిలో చివరి నిమిషంలో చోటు చేసుకునే పరిణామాలు, గెలుపు ఓటములు నిర్ణయిస్తాయనే ఉద్దేశ్యంతో అన్ని పార్టీలు అప్రమత్తమయ్యాయి.

సుమారు నెలరోజులుగా సాగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంది. ఈనెల13న పోలింగ్ జరగనుండగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 5 గంటలకు అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాన్ని ముగించాల్సి ఉంది. గతనెల18న ఎన్నికల షెడ్యూల్ విడుదల, నామినేషన్ల పర్వంతో వేడెక్కిన రాజకీయం ఇన్నాళ్లు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాల చుట్టూ తిరిగింది. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, నేతలు, అనుచరులను ప్రచారపర్వంలో మోహరించిన నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్వశక్తు లొడ్డారు.

ప్రచార పర్వంలో ప్రత్యర్థిపై పైచేయి సాధించేందుకు సభలు, సమావేశాలతోపాటు ఇతర ప్రచార కార్యక్రమాలను ఎంచుకున్న నేతలు ప్రచారపర్వం ముగియనుండడంతో తదుపరి కార్యాచరణపై దృష్టిసారించారు. శనివారం సాయంత్రం మొదలుకుని సోమవారం పోలింగ్ ముగిసే వరకు అనుసరించాల్సిన వ్యూహంపై మల్లగుల్లాలు పడుతున్నారు. పోలింగ్ రోజు అనుకూలంగా ఉండే ఓటర్లను బూత్‌వరకు తీసుకెళ్లేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై నేతలు దృష్టిపెట్టారు. ప్రచారం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో బూత్‌స్థాయిలో తమ బలబలాలపై నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.

### ప్రలోభాలపై దృష్టి..

ప్రచార పర్వం ఈ రోజు సాయంత్రం 5 గంటలతో ముగుస్తుండడంతో ఇక బరిలో నిలిచిన అభ్యర్థుల తరపున స్థానికంగా ఉన్న పార్టీల ప్రధాన నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రలోభాలపై దృష్టి సారించారు.

### బూత్‌లపైనే అందరి దృష్టి..

బూత్‌ల వారీగా ఉండే ఓట్లు, సామాజికవర్గాల వారీగా సమీకరణలు, మహిళలు, యువత, తదితర క్యాటగిరీగా ఓటర్ల జాబితాను అభ్యర్థులు, నేతలు విశ్లేషించారు. బూత్‌స్థాయిలో అనుకూలంగా ఉండే నాయకులు క్రియాశీల కార్యకర్తల జాబితాలను కూడా సిద్ధం చేసుకున్నారు. అన్ని పార్టీలు బూత్‌స్థాయి లెక్కలపైనే దృష్టి పెట్టడంతో వచ్చే రెండురోజులపాటు గ్రామాల్లోనే ఉండాల్సిందిగా స్థానిక నేతలకు అభ్యర్థులు నొక్కి చెబుతున్నారు. బూత్‌స్థాయిలో మద్యం, డబ్బు పంపిణీ తదితర ప్రలోభాలకు అవకాశాలు ఉండడంతో ప్రత్యర్థి ఎత్తులను పసిగట్టేలా స్థానిక నాయకత్వాన్ని అప్రమత్తం చేస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత కూడా గ్రామాల్లో అంతర్గతంగా ప్రచారవేడి కొనసాగుతుండగా మద్దతు కూడగట్టుకునేలా విందు రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. కుల సంఘాల నేతలు, గ్రామ స్థాయిలో పలుకుబడి కలిగిన వారిని ప్రసన్నం చేసుకు నేందుకు అభ్యర్థులు రాత్రి వరకు బేటీ అవుతున్నారు. ఇదిలా ఉంటే ప్రచార పర్వం ముగింపుదశకు చేరుకోవడంతో పోలీసులు, ఎన్నికల యంత్రాంగం అప్రమత్తమైంది. ఇన్నాళ్లు ప్రధాన మార్గాల్లో మాత్రమే తనిఖీలకు పరిమితమైన పోలీసు, ఎక్సైజ్ బృందాలు ప్రస్తుతం గ్రామస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేశాయి.



వివిధ పార్టీల అభ్యర్థులు ఇప్పటికే పలు సంఘాలతో చర్చించి గంపగుత్తగా ఓట్లు కొనుగోలుకు తెరతీయగా, వ్యక్తిగతంగా ప్రలోభానికి గురి చేసేందుకు దృష్టి సారించారు. డబ్బు, మద్యం పంపిణీకి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. చివరి రెండు రోజులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే




ఆసిఫాబాద్‌లో 5కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 10: ఈనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికలలో అర్హులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా చేపట్టిన 5కే రన్ కార్యక్రమాన్ని ఆయన అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి పాటుపడే నాయకత్వాన్ని ఓటుహక్కుద్వారా ఎన్నుకోవాలన్నారు. పోలింగ్‌శాతాన్ని పెంచే విధంగా కళాజాతా ప్రదర్శన, ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజలను చైతన్య పర్చుతామని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవడంతోపాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అందరు ఓటువేసేలా చైతన్యపర చాలని తెలిపారు. హోం ఓటింగ్ ద్వారా ఆసిఫాబాద్‌లో వందవాతం ఓటింగ్ సాధించామన్నారు. సిర్పూర్‌లోకూడా సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కుల,మత,వర్గ,ప్రాంతాల వివక్షలేకుండా, ప్రలోభాలకు గురికాకుండా పోలింగ్ రోజు నిష్పక్షపాతంగా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే టోల్ ఫ్రీనెం.950, సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం 5కే రన్‌లో జిల్లా అధికారులు, యువతీ,యువకులు, విద్యార్థులు, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్, మే 10: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ సదయ్య అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుంచి డీఎస్పీ సదయ్య జెండా ఊపి కవాతును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల13న జరుగబోయే లోక్‌సభ ఎన్నికలను ఎలాంటి అల్లర్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి మద్యం, డబ్బు ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1950, సీవిజిల్ అప్లికేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కేంద్రబలగాలు, పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసిఫా బాద్, రెబ్బెన, వాంకిడి సీఐలు సతీష్, చిట్టిబాబు, శ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్లు రాకేష్, రాజు, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బద్రీ ప్రసాద్, ఎస్సైలు రాజేశ్వర్, ప్రవీణ్ పోలీసులు పాల్గొన్నారు.

## ఉపాధికూలి రేట్లు పెంచింది మోదీ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



ఉపాధి పనుల్లో మట్టిని తవ్వుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

చింతలమానేపల్లి, మే 10: మండలంలోని డబ్బా గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్దకు శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీకూలీ రేటు రూ.300కు పెంచామని త్వరలోనే ఇంకొంత పెంచుతామని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, పల్లె ప్రకృతి వనాలు తదితరాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలియజేశారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు ఓటువేసి అత్యధికమెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, మల్లయ్య పాల్గొన్నారు.

## యోగేశ్వర కృషి క్షేత్రంలో భూమి పూజ



పూజలు నిర్వహిస్తున్న రైతులు

బెజ్జూరు, మే 10: అక్షయతృతీయ సందర్భంగా శుక్రవారం ఎల్కపల్లి గ్రామంలోని యోగేశ్వర కృషిక్షేత్రంలో స్వాధ్యాయ పరివార్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త పాండురంగ శాస్త్రి అటవలె అందించిన స్వాధ్యాయ కార్యక్రమంలో భాగంగా రైతులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పనిముట్లకు, ఎడ్లకు మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా హనుమాన్ ఆలయం నుంచి పాండురంగశాస్త్రి అటవలే, దేవతామూర్తుల చిత్రపటాలతో ఆధ్యాత్మికస్తోత్రాలు పఠిస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

## బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి, మే 10: వాంకిడి మండలం నవేగాం గ్రామ పంచాయతీ పరిధిలోని టొక్కిగూడ గ్రామానికి చెందిన రాజక్క గత సంవత్సరం వన్య ప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి రెండు కళ్లు కోల్పోయింది. బాధిత కుటుంబాన్ని వాంకిడి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఎస్సై సాగర్ పరామర్శించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

## పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

కాగజ్‌నగర్, మే 10: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం నాయకుడు కూశన్న రాజన్న అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీప్రభుత్వం కార్మికరంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. బీజేపీని ఓడిస్తేనే అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ బందిఖానా నుంచి దేశాన్ని విముక్తిచేద్దాం అనేపుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, సాయికృష్ణ, సాయి, సుధాకర్, నితీష్, అంగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

## ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

- హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

ఆసిఫాబాద్, మే 10: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, సహాయ ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఈనెల13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పోలింగ్ నిర్వహణలో పొరపాట్లకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంచేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 320 పోలింగ్ కేంద్రాలకుగాను 40రూట్లుగా విభజించి 40 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 356పోలింగ్‌కేంద్రాలకు 51రూట్లు విభజించి 51మంది సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అత్యవసర సేవలు అందిస్తున్నవారు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయాల్లో ఈనెల3నుంచి 10 వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటుచేసి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్‌రోజు సమీపిస్తున్నందున తనిఖీలు ముమ్మరంగా చేపట్టేందుకు ఫ్లయింగ్, స్టాటిస్టికల్, వీడియో సర్వేయలెన్స్ బృందాలద్వారా పర్యవేక్షిస్తూ చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేపడతామని, పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాయంత్రం 4గంటలలోగా పోలింగ్‌సిబ్బంది కేంద్రాలకు చేరుకునేవిధంగా కార్యాచరణఅమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే ఓటరుస్లిప్పులు పంపిణీ చేశామన్నారు. మోడల్ పోలింగ్‌కేంద్రాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్‌రోజు మాక్ పోల్‌నిర్వహణకు కూడా అన్నిఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అధికారులు, తహసీల్దార్ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- సిర్పూరు సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి

కాగజ్‌నగర్, మే 10: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సిర్పూరు సహాయ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సెక్టార్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో ఏమైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది అంతా కూడా బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి, పాల్గొన్న అధికారులు

## విశ్వగురు బసవ జయంతి ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న లింగాయత్ జంగమ సభ్యులు

వాంకిడి, మే 10: వీరశైవ లింగాయత్ జంగమ సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం బసవ జయంతిఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హిందూ సమాజంలో ప్రబలంగా ఉన్న కులవ్యవస్థ, సామాజిక అసమానతలను తొలగించడానికి, సమా నత్వం, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడానికి లింగాయత్ శాఖను స్థాపించాడని అతనిఅనుచరులు శరణులు లేదా శివభక్తులుగా పిలువబడ్డారని జంగమసమాజం సభ్యులుతెలిపారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలల వేసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగేంద్రయ్య, నరేందర్, చంద్రశేఖర్, జగదీష్, రాకేష్, మహేష్, శైలేష్, సతీష్, జ్యోతి, మాదురి, కళ్యాణి, నీలాబాయి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ రూరల్, మే 10: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో 40సీట్ల చొప్పున మొత్తం 160సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈనెల25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల27న ఎంపిక జాబితా విడుదల చేసి 29నుంచి 31వరకు ధ్రువపత్రాల పరిశీలన చేసి ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

# నకిలీలతో.. పారా హుషార్!

- పొంచి ఉన్న నకిలీ విత్తనాల బెడద
- అప్రమత్తం లేకుంటే నష్టపోయే ప్రమాదం
- ప్రతీ ఏటా పట్టుబడుతున్న నకిలీ విత్తనాలు
- మరో నెల రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం
- అవగాహన కల్పించలేకపోతున్న అధికారులు



పట్టుబడిన నకిలీ విత్తనాలు (ఫైల్)

చింతలమానేపల్లి, మే 10: వానాకాలం పంటల సాగు మరోనెల రోజుల్లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల హడావిడి. అధికారులు, పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉన్నది. ప్రతీఏడాది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలను ఇక్కడకు తీసుకురావడం, మాయమాటలు చెప్పి రైతులకు అంటగట్టడం పరిపాటిగా మారింది. అయితే ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో అధికార యంత్రాంగం శ్రద్ధ చూపరన్న విశ్వాసంతో దళారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్ర ప్రాంతం నుంచి అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి భారీగా విత్తనా లను తరలించి నిల్వలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమ, నకిలీ దందా నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించినా ఇదే పనిని వృత్తిగా భావించి ఈ దందాను కొందరు సాగిస్తున్నారు. చాలావరకు గతంలో పట్టుబడిన నిందితులే ఈ దందా సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



గతంలో నకిలీ విత్తనాలను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

### జిల్లాలో 4.6లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 15మండలాల పరిధిలో 4.6లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని సంబంధిత వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో అగ్రస్థానంలో 3లక్షల పైచిలుకు ఎకరాల్లో పత్తిపంట, రెండవస్థానంలో వరిపంటలు సాగవుతాయి. మిగతా భూమిలో వివిధరకాల పంటలు సాగవుతాయి. కేంద్ర ప్రభుత్వం బీటీ-3 విత్తనాలను నిషేదించింది. కేవలం బీటీ-2 విత్తనాలకు అనుమతి ఇచ్చింది. అయితే పలువురు దళారులు ముఠాగా ఏర్పడి బీటీ-3 దందాను ఏటా నిర్వహిస్తు అమాయక రైతులకు మాయ మాటలు చెప్పి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. బీటీ -3విత్తనాలను వరుసగా 7సంవత్సరాలు సాగుచేస్తే 8వ ఏటనుంచి పంటచేన్లు వ్యవసాయానికి అక్కరకు రావని అధికారులు సూచిస్తున్నారు. భూసారం తగ్గిపోవడంతో పాటు, ఖనిజ లవణాలు దెబ్బతిని పంటలు పండే ఆస్కారం తక్కువని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాన్సర్ కారకాలు కూడా ఈ విధానంలో పొంచి ఉన్నట్లు చెబుతున్నారు. సంబంధితశాఖ అధికారులు సైతం గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిఉన్నా ఆదిశగా అధికారులు పనిచేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ, పోలీస్ అధికారులు రైతులు నష్టపోకుండా నకిలీపై అప్రమత్తంగా ఉండేలా చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి..

**- రామకృష్ణ, ఇన్‌చార్జీ ఏవో, చింతలమానేపల్లి**

నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. దళారులు చెప్పిన మాయమాటలు విని మోసపోవద్దు. రైతులు ప్రభుత్వ అనుమతి ఉన్న ఫెర్టిలైజర్ షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వెంటనే రశీ దును తప్పనిసరిగా తీసుకోవాలి. ఎవరైనా రైతులను మోస గించి నకిలీవిత్తనాలు అంటగడితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటాం.